అందరి చూపు.. షియా ఓట్ల వైపు

- చార్మినార్‌లో షియా ఓట్లే కీలకం
- మజ్లిస్, బీజేపీ, కాంగ్రెస్‌ల విజయం తేల్చేదీ ఈ ఓటర్లే
- షియా ఓట్లు ఎటువైపో.. గెలుపు కూడా అటువైపే

చార్మినార్: చార్మినార్ నియోజకవర్గంలో షియా ఓటర్లు ఈ ఎన్నికల్లో ప్రభావం చూపనున్నారు. నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన మీర్ జుల్ఫికర్ అలీ, బీజేపీ అభ్యర్థి మెఘారాణి, కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ముజీబుల్లా షరీఫ్, బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ తదితరులు ఈ ఎన్నికల్లో విజయం సాధించడానికి అవసరమైన ప్రచారం కొనసాగిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అన్ని వర్గాల ఓటర్లను కలుస్తూ ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో మెజార్టీ ఓటర్లెన్న ముస్లింలు అభ్యర్థి విజయాన్ని ఖరారు చేయనున్నారు. చార్మినార్ నియోజకవర్గంలో జరిగే ఎన్నికలు ఆయా సామాజిక వర్గాల ఓట్లపై ఆధారపడి ఉంటున్నాయి. తమ వర్గానికి చెందిన ఓట్లు తమ పార్టీకే పడుతాయన్న ధీమాతో మజ్లిస్ పార్టీతో పాటు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఆశగా ఎదురు చూస్తున్నాయి. నియోజకవర్గంలో మెజార్టీ ఓటర్లెన్న ముస్లిం ఓటర్లలో షియా ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ప్రభావాన్ని చూపనున్నారు. షియా ఓటర్లు ఎటు వైపు మొగ్గితే.. ఆ పార్టీ అభ్యర్థి విజయం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కాగా..ఇప్పటికే షియా ముస్లిం వర్గానికి చెందిన రియాజుల్ హసన్ హాఫందీ మజ్లిస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా కొనసాగడమే కాకుండా చార్మినార్ నియోజక వర్గం పరిధిలోనే ఉంటుండడంతో షియా ఓట్లన్నీ గంపగుత్తగా తమ పార్టీకే లభిస్తాయని మజ్లిస్ పార్టీ భావిస్తోంది.

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు: 2,24,066

పురుషులు : 1,17,480

మహిళలు : 1,06,558

థర్డ్ జెండర్ : 28



షియా ముస్లింలకు చెందిన దారుషిఫాలోని ఆజాఖానా జహెరా అషూర్‌ఖానా

షియా ఓటర్లను ఆకట్టుకునేందుకు..

ఏ విధంగానైనా షియా ఓటర్లను తమ పార్టీ వైపు తిప్పుకోవడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లలో పార్టీల అభ్యర్థులు నిమగ్నమయ్యారు. సభలు, సమావేశాల ద్వారా షియా నాయకులను మచ్చిక చేసుకుంటున్నారు. గ్రూపు మీటింగ్‌లు ఏర్పాటు చేసి తాను విజయం సాధిస్తే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు. కొంతమంది షియా ఓటర్లు ప్రతిసారి లాగా కాకుండా ఈసారి ఇతర పార్టీ అభ్యర్థికి తమ అమూల్యమైన ఓటును వేయడానికి సిద్ధపడుతున్నట్లు కొంతమంది షియా నాయకులు బహిరంగంగా చెబుతున్నారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో షియా ఓటర్లు మార్పును కోరుకుంటున్నట్లు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో షియా ఓటర్లు మూకుమ్మడిగా ఏ పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తే ఆ పార్టీ అభ్యర్థి విజయావకాశాలు మెండుగా ఉంటాయి. దీంతో మజ్లిస్, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు షియా ఓటర్ల వైపు చూస్తున్నాయి. అభ్యర్థి విజయాన్ని షియా ఓటర్లు నిర్ణయించనుండటంతో ఈ ఎన్నికల్లో షియా ఓటర్లు కీలకంగా మారారు.

జంగ్ తెలంగాణ 2023

షియా ముస్లింల ప్రాంతాలు..

చార్మినార్ నియోజకవర్గంలోని పురానీహవేలి, మీరాలంమండి, దారుషిఫా, జహేరానగర్, పంజేషా, దర్వాజా, మాతాకికిడికి, అలిజాకోట్లా, జాఫ్రి గల్లీ, కోమటివాడి, నూర్‌ఖాన్‌బజార్, కట్టిలగూడ-కాలికబర్ తదితర ప్రాంతాల్లో ముస్లిం ఓటర్లు అత్యధికంగా ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గంలో మొత్తం 25–35 వేలకు పైగా షియా ముస్లిం ఓటర్లున్నారు. ఈ ఎన్నికల్లో 65 శాతం వరకు పోలింగ్ జరిగితే.. ఈ ఓట్లు ఏ అభ్యర్థికి వస్తే ఆ అభ్యర్థికి విజయం వరించే అవకాశాలున్నాయి.

షియా వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలి..



ఉత్తర్‌ప్రదేశ్‌తో పాటు బిహార్‌లో ఉన్నట్లుగా షియా ముస్లింల కోసం సపరేట్‌గా షియా వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలి. ఏళ్ల తరబడి షియా ప్రజల కోసం ప్రత్యేక వక్ఫ్ బోర్డు కావాలని డిమాండ్ చేస్తున్నాం. ఈసారైనా మా వినతి మేరకు వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలి..


– మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, అఖిల భారత షియా సమాజ్ వ్యవస్థాపక కార్యదర్శి

మంత్రి కేటీఆర్‌ను కలిసిన మెట్టు రాఘవేంద్ర



అబిడ్స్: మంత్రి కేటీఆర్‌ను టీటీడీ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మెట్టు రాఘవేంద్ర గురువారం కలిశారు. ఇటీవల గోషామహల్‌కు చెందిన స్టేట్ వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు మెట్టు రాఘవేంద్ర టీటీడీ నూతన వైస్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. రాఘవేంద్ర మాట్లాడుతూ.. తనకు పదవి అప్పగించిన ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, టీటీడీ పాలకమండలికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు అయ్యప్ప మహా పడిపూజ



బొడ్డు సాయిబాబా

గౌలిపురా: గౌలిపురా భరతమాత ఆలయం సమీపంలో ఈనెల 18న అయ్యప్ప మహా పడిపూజా కార్యక్రమాన్ని నిర్వాహకులు బొడ్డు సాయిబాబా తెలిపారు. జగదీష్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి అయ్యప్ప మహా పడి పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ పూజలో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

‘ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఓటమి తప్పదు’



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతారావు

అబిడ్స్: బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్ ఓటమి తప్పదని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతా రావు పేర్కొన్నారు. అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పదేళ్లుగా గోషామహల్‌లో ఎమ్మెల్యే రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఆరు గ్యారంటీలతో ప్రజలకు అన్ని పథకాలు అందించే కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆమె తెలిపారు. తనను గెలిపిస్తే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో గోకరణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

‘సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి’



ప్రచారం చేస్తున్న సలావుద్దీన్ లోధీ

చార్మినార్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన తన అనుచరులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం పాదయాత్ర చేశారు. ఆయన మాట్లాడుతూ.. చార్మినార్ నియోజక వర్గంలోని హిందూ, ముస్లిం ఓటర్లు తమ పార్టీకి మద్దతు తెలియజేస్తున్నారన్నారు.

‘పాతబస్తీలో మజ్లిస్ పార్టీ చేసిందేమీ లేదు’



చార్మినార్: పాతబస్తీలో దశాబ్దాలుగా మజ్లిస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఎక్కడ ఎలాంటి అభివృద్ధి చేయలేదని.. అందుకే పాతబస్తీలోని అన్ని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని బహదూర్‌పురా నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి వై.నరేష్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించి ఇంటింటికి వెళ్లి ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే.. నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్ విజయం



మాట్లాడుతున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: సంక్షేమం పథకాలతోనే గోషామహల్‌లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని నగర బీఆర్ఎస్ ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. శృంగృషి భవన్‌లో వ్యాపారస్థులు, సిక్వాల్ సమాజ్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో ఉత్తర భారతీయులతో పాటు అన్నివర్గాల ప్రజలకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. చైర్మన్‌లు కోలేటి దామోదర్‌గుప్తా, జగన్‌మోహన్‌రావు, ఇన్‌చార్జి మోతే శోభన్‌రెడ్డి మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలంతా రాజాసింగ్‌పై వ్యతిరేకంగా ఉన్నారన్నారు. పదేళ్లుగా రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని ప్రజలంతా తీవ్రంగా విమర్శిస్తున్నారన్నారు. అభివృద్ధి చేసే నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌ను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశీష్‌కుమార్ యాదవ్, జయశంకర్, పప్పుమాత్రే, కోటీ శైలేష్‌కురుమతో పాటు పెద్ద ఎత్తున వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



బల్కంపేట ఎల్లమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న మధుసూదన్ యాదవ్

చార్మినార్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించాలని కోరుతూ పాతబస్తీ హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధి, అమీర్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి మధుసూదన్ యాదవ్ బల్కంపేట్ ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సనత్‌నగర్ శాసనసభ నియోజకవర్గం నుంచి మూడోసారి తలసాని విజయం సాధించి హాట్రిక్ కొట్టనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



మహ్మద్ జాహేద్‌తో మాట్లాడుతున్న కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యే అభ్యర్థి కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్లలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి కూడా కార్వాన్ నియోజకవర్గం నుంచి తన గెలుపు ఖాయమని ప్రజల ఆదరాభిమానాలు తనకు మెండుగా ఉన్నాయని చెప్పారు. కొత్త అసెంబ్లీ మొదటి సమావేశంలోనే దివ్యాంగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు వారికి ఇచ్చే పింఛన్లను కూడా పెంచాలని తాను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానన్నారు. కార్వాన్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే తనను గెలిపించాలని కోరారు. నానల్‌నగర్ కార్పొరేటర మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, వాజీఉజ్జమా తదితరులున్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం



ఓటు వేయాలని కోరుతున్న పులిపాటి రాజేశ్‌కుమార్

చార్మినార్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలే తమ విజయానికి దోహదం చేస్తాయని బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి నియోజకవర్గంలోని పలు బస్తీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ ఎన్నిల్లో బహదూర్‌పురా నుంచి తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్

చార్మినార్: అర్హులందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండజ్ జస్టిస్(ఎంపీజే) రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. చెత్తాబజార్‌లోని కార్యాలయంలో గురువారం ఎంపీజే రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీజే ఏ ఒక్క పార్టీకి సంబంధించిన సంస్థ కాదన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా పని చేసేదే ఎంపీజే అని పేర్కొన్నారు. ఓటు ద్వారానే నిజాయితీ గల ప్రజా సేవకుడిని ఎంపిక చేసుకోవడానికి వీలు పడుతుందన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలు క్రమశిక్షణతో పని చేయాలి



కన్హాయ్యలాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో పని చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ పరిశీలకుడు కన్హాయ్యలాల్ అన్నారు. గురువారం ఆయన కార్వాన్ నియోజకవర్గ సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రానుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని ఆయన విమర్శించారు. అవినీతికి పాల్పడడం తప్పితే సీఎం కేసీఆర్ ప్రజల కోసం చేసిందేమి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, ఎం.రఘుపాల్‌రెడ్డి, చంటిబాబు, రాములు తదితరులున్నారు.

యాకుత్‌పురాలో జోరందుకున్న ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సామా సుందర్‌రెడ్డి

యాకుత్‌పురా: ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో యాకుత్‌పురా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. పలు ప్రాంతాల్లో అభ్యర్థులు ఎన్నికల ప్రచారాలతో సందడి నెలకొంది. ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ప్రారంభించి తమదైన శైలీలో దూసుకెళ్తున్నారు. ఈసారి బరిలో ఉన్న మజ్లిస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ రెయిన్‌బజార్, తలాబ్‌చంచలం డివిజన్లలో ప్రతిరోజూ పాదయాత్రలు నిర్వహిస్తూ ప్రచారం కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి సామా సుందర్‌రెడ్డి ఐఎస్‌సదన్, గౌలిపురా డివిజన్ల పరిధిలో ప్రచారం చేస్తూ నాయకులు, కార్యకర్తలో జోష్ నింపుతున్నారు. బీజేపీ అభ్యర్థి వీరేందర్ బాబు యాదవ్ కుర్మగూడ, ఐఎస్‌సదన్ డివిజన్లలోని పలు బస్తీలు, కాలనీల్లో ప్రచారం చేస్తూ తమదైన శైలీలో ఓట్లు అభ్యర్థిస్తూ ప్రచారంలో దుసుకెళ్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కే.రవిరాజు ఐఎస్ సదన్, గౌలిపురా తదితర డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ.. బస్తీ, కాలనీ సంక్షేమా సంఘలతో సమావేశాలు నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఎంబీటీ అభ్యర్థి మహ్మద్ అంజదుల్లాఖాన్ సైతం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం కొనసాగిస్తున్నారు. ఎన్నికల ప్రచారం నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నారు.

విజయనగర్‌కాలనీలో బీఆర్ఎస్ అభ్యర్థి పాదయాత్ర



విజయనగర్‌కాలనీ: నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్ గురువారం విజయనగర్‌కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. బీఆర్ఎస్ చేపడుతున్న ప్రజారంజక పాలన తిరిగి బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటువేసి తనను గెలిపించాల్సిందిగా కోరారు. ఆసిఫ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి బాల్‌చందర్, సంజయ్, విద్యాసాగర్, అభిషేక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

సుల్తాన్‌బజార్: రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన అవసరమని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ సెంటర్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. గురువారం కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహన ప్రయాణంలో నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారుతుందని ఆయన అన్నారు. ర్యాష్ డ్రైవింగ్, మత్తుపదార్థాలు సేవించడం, డ్రంకన్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల కలిగే అనార్థాలను విద్యార్థులకు ఆడియో రూపంలో అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కిరణ్మయ్, సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎంపీహెచ్‌ఓ వేణుగోపాల్ గౌడ్, ఉపేందర్‌రెడ్డి, అనిల్, బాబురావు పాల్గొన్నారు.

కార్వాన్‌లో ముమ్మర ప్రచారం



కూరగాయలు విక్రయిస్తూ ఓటు వేయాలని కోరుతున్న మిత్రకృష్ణ

జియాగూడ: జియాగూడ, కార్వాన్ డివిజన్లలో గురువారం అన్ని పార్టీలు జోరుగా ప్రచారం చేశాయి. ఓటు వేయాల్సిందిగా కోరుతూ ఓటర్లను, వ్యాపారస్థులను, చిరువ్యాపారస్థులను కలిసి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ముస్తయిద్‌పురాలో ఎంఐఎం అభ్యర్థి కౌసర్ ఓ మహిళను ఓటు వేయాల్సిందిగా కోరగా ఆమె ఆశీర్వదించింది. కార్వాన్ సాహులో దర్జీ దుకాణంలో బట్టలు కుడుతూ ఓటు వేయాల్సిందిగా బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ కోరారు. అలాగే బాంజావాడిలో కూరగాయలు విక్రయిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ ఓటు వేయాల్సిందిగా బస్తీ వాసులను కోరారు.

ఓటమి భయంతోనే రాజాసింగ్ చిల్లర రాజకీయం



ఉస్మాన్‌గంజ్‌లో ప్రచారం చేస్తున్న నందకిశోర్ వ్యాస్, ధన్‌రాజ్, ఆర్‌వీ మహేందర్ కుమార్

అబిడ్స్: ఓటమి భయంతోనే బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆరోపించారు. గురువారం ఉస్మాన్‌గంజ్, బేగంబజార్, గౌలిగూడ, మహరాజ్‌గంజ్, రిసాల్లాబ్దుల్లా తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేసి బీఆర్ఎస్‌నే గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉన్న గోషామహల్‌లో చిచ్చుపెట్టేందుకు ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రయత్నిస్తున్నారన్నారు. ఓటమి చెందుతానని భయంతోనే రాజాసింగ్ అందరిపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో గోషామహల్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్‌వీ మహేందర్‌కుమార్, ధన్‌రాజ్, ఆల పురుషోత్తమ్‌రావు, రాంచందర్‌రాజు, సురేష్ ముదిరాజ్, ఆశీష్‌మహరాజ్, పి.నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ



అబిడ్స్: హైదరాబాద్ జిల్లా టీ ఎన్జీఓస్ అధ్యక్షుడు, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో మెహిదీ నవాజ్ జంగ్ ఆస్పత్రి వద్ద అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. ప్రతినెలా తాము పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. డాక్టర్ బెంజిమెన్, పర్వతాలు, కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్రీ, శ్రీధర్‌నాయుడు, ముబీం ఖురేషి, శేఖర్ పాల్గొన్నారు.

మారుతున్న ఆహారపు అలవాట్లతో మధుమేహం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ మజహర్‌ఉల్లా

గోల్కొండ: మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా మధుమేహం బారిన ఎందరో పడుతున్నారని ప్రముఖ డయాబెటాలజిస్టు, గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజర్‌ఉల్లా అన్నారు. గురువారం గోల్కొండ కోట వద్ద తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో టాక్ ఫర్ హెల్త్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది పర్యాటకులు, 30 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధుమేహం అనేది తల్లిదండ్రుల ద్వారా సంక్రమించే అవకాశం ఉందని అన్నారు. ఎక్కువ శాతం మధుమేహ వ్యాధిగ్రస్తులు ఆహారపు అలవాట్లు, ఆహారపు నియమాలు పాటించకపోవడం వల్ల వ్యాధి బారిన పడుతున్నారని అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్, డాక్టర్ ఖరీమ్, ఖాలేద్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం హామీకి మేం వ్యతిరేకం



మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వాగ్దానాన్ని ఖండిస్తున్నామని తెలంగాణ ఆటోడ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లా ఖాన్ అన్నారు. గురువారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేస్తే మళ్లీ నగరంలో మతకలహాలు, ఘర్షణలు చెలరేగి కర్ఫ్యూ లాంటి రోజులు తిరిగి వస్తాయని హెచ్చరించారు. ‘ఫిర్ ఏక్ బార్ కేసీఆర్’, ఆటోవాలా జిందాబాద్ లాంటి నినాదాలను బలపరుస్తూ జేఏసీ ఏకగ్రీవంగా తీర్మాణం చేసినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో అధిక మెజార్టీతో మళ్లీ సీఎం కావాలని కోరుతూ శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించబోయే సమావేశంలో భారత్ రైజింగ్ స్టార్, దిల్‌వాల సీఎం అనే బిరుదులను ఇచ్చి ఘనంగా సత్కరిస్తున్నట్లు తెలిపారు. బహదూర్‌పురా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఇనాయత్ అలీ భాక్రీ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు ప్రదానం చేస్తున్న రెండు బిరుదుల మెమొంటోలను ఆయనకు అందజేస్తామన్నారు. మహ్మద్ అజీముద్దీన్, ఎంఏ సలీం, రఫతుల్లా బేగ్, కె.లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే.. అభివృద్ధి చేస్తా



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి వీరేందర్ బాబు యాదవ్

గౌలిపురా: తనకు ఈసారి అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ యాకుత్‌పురా నియోజకవర్గం అభ్యర్థి ఎస్.వీరేందర్ బాబు యాదవ్ అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని బీజేపీ ఎన్నికల కార్యాలయంలో గౌలిపురా డివిజన్ పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ప్రతి ఒక్క పథకాన్ని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తూ ప్రజలకు చైతన్యపరచాలన్నారు. తమకు ఎంఐఎం పార్టీతోనే ముఖ్యమైన పోటీ ఉంటుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంబీటీ పార్టీ అభ్యర్థులు ఎంఐఎం పార్టీకి లబ్ధి చేకూర్చడానికి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయన్నారు. పాదయాత్ర సమయంలో ప్రజలు పలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని..తనను గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆలే జితేంద్ర, కె.సహదేవ్ యాదవ్, చర్మాణి రూప్‌రాజ్, జమాల్‌పూర్ చంద్రశేఖర్, గౌలీకర్ ధీరజ్‌లాల్, ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, జి.రఘుకాంత్, మోకాళ్ల వెంకటేష్, జె.అశోక్, ఎ.భానుప్రకాశ్, డి.యాదగిరి, కె.సురేందర్ పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్టలో బీఎస్పీ ప్రచారం

చాంద్రాయణగుట్ట: బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి మూల రామ్‌చరణ్ దాస్ గురువారం ఉప్పుగూడ, శివాజీనగర్ బస్తీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..పేదలకు న్యాయం జరగాలంటే.. మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే.. అదే విధంగా మహిళలకు సమాన అవకాశాలు రావాలంటే బహుజన్ సమాజ్ పార్టీని ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చాట్ల చిరంజీవి, సురేశ్, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ పుట్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

సుల్తాన్‌బజార్: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఖైరతాబాద్ జోన్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం కోఠిలోని యూపీహెచ్‌సీలో కింగ్‌కోఠి క్లస్టర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య అధికారులకు, పీహెచ్ఎన్‌లకు, స్టాఫ్ నర్సులకు, ఏఎన్ఎంలకు, ఫార్మసిస్టులకు, ల్యాబ్ టెక్నీషియన్లకు, డీఈఓలకు వారు చేయాల్సిన విధులపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీహెచ్‌ఓ విజయలక్ష్మి, డాక్టర్ మనోజ్‌రెడ్డిలతో పాటు వివిధ క్యాడర్ల సిబ్బంది పాల్గొన్నారు.